క్లుప్తంగా

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ

అయిజ: బయోస్టాంట్ కంపెనీ ఆధ్వర్యంలో మండలంలోని భూంపురం పాఠశాల విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేశారు. జెడ్పీహెచ్‌ఎస్‌లో 9వ తరగతిలో అధిక మార్కులతో ఉత్తీర్ణులై, ఈ ఏడాది పదో తరగతి చదువుతున్న పది మంది విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసి ఒక్కొక్క విద్యార్థికి రూ.2,500 చొప్పున అందజేశారు. కార్యక్రమంలో సురేష్, వేణుగోపాల్, భీమేశ్వర్‌రెడ్డి, పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్: విద్యుత్ సరఫరాలో బుధవారం తాత్కాలిక అంతరాయం ఉంటుందని ఏడీఈ రమేష్‌బాబు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు జిల్లా కేంద్రంలోని వేణుకాలని, నందీశ్వర ఆలయం, బీరెల్లీ చౌరస్తా, 2వ రైల్వేగేటు కాలనీలకు సరాఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపు స్కూల్ గేమ్స్

అలంపూర్: మండల స్థాయి 68వ స్కూల్ గేమ్స్ గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ అశోక్ కుమార్, మండల కన్వీనర్ భరత్‌కుమార్ సంయుక్త ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాలలో పోటీలు జరగనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. అండర్-14, 17 విభాగంలో ఖోఖో, వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ధరూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 29న ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ సురేష్, జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు.

30న శాంతినగర్‌లో..

శాంతినగర్: విద్యార్థులకు ఆటల పోటీలు 30న నిర్వహిస్తున్నామని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులందరూ పాల్గొనాలని ఎంఈఓ నరసింహ ప్రకటనలో తెలిపారు. స్థానిక రవీంద్ర ఎయిడెడ్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు 14 నుంచి 17 ఏళ్లలోపు ఉండి, బోనఫైడ్ వెంట తీసుకురావాలని ఎస్‌జీఎస్ సెక్రటరీలు జితేందర్, మల్లీశ్వరి కోరారు.

పెన్షనర్లపై నిర్లక్ష్యం వీడాలి

గద్వాల అర్బన్: పెన్షనర్ల సమస్యలను పరిష్కారించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని పెన్షనర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహ్మద్ ఇక్బాల్ పాష, జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ బాబు మంగళవారం ప్రకటనలో తెలిపారు. మూడేళ్లుగా డీఏలు, క్యాష్‌లెస్ వైద్య చికిత్స, ఐఆర్ పెంపు, కొత్త పీఆర్‌సీ తదితర సమస్యలు పెండింగ్‌లోనే ఉన్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెన్షనర్ల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి 9 నెలలు గడుస్తున్నా పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని, న్యాయబద్ధంగా రావాల్సిన నగదు బకాయిలన్నింటిని ఏకకాలంలో చెల్లించాలని డిమాండ్ చేశారు.

పాఠశాలను సందర్శించిన నాయకులు

అయిజ: మున్సిపాలిటీలోని భరత్‌నగర్ కాలనీలో మంగళవారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను అఖిలపక్ష కమిటీ నాయకులు సందర్శించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. విద్యార్థులకు మరుగుదొడ్లు ఏర్పాటు చేయలేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోయారు. పాఠశాలకు మౌలిక వసతులు కల్పించాలని హెడ్ మాస్టర్ లక్ష్మీనారాయణగౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆంజనేయులు, వెంకట్రాముడు, మారెప్ప, వెంకటేష్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

పారితోషికం అందజేత

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాలలో చదివిన విద్యార్థి మదన్ పదో తరగతిలో 10 జీపీఏ సాధించాడు. విద్యార్థికి మల్దకల్ మండలంలోని ఎల్కూరులో జెడ్పీహెచ్‌ఎస్‌లో స్కూల్ అసిస్టెంట్ వెంకట్రాములు మంగళవారం రూ.5వేల నగదు పారితోషికంగా అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలి



మల్దకల్: రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించి మంచి దిగుబడులు పొందాలని మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో వ్యవసాయ, జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు వీసీ ద్వారా రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ వీసీ ద్వారా రాష్ట్ర వ్యవసాయశాఖ అధికారులు నేరుగా రైతులతో మాట్లాడారు. పంటల సాగు విధానంపై అవగాహన కల్పించారు. పంటలకు ఆశించే చీడపీల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులను వాడితే భూమి సారవంతంగా ఉంటుందని తెలిపారు. తక్కువ పెట్టుబడులతో ఎక్కువ లాభాలు వచ్చే పంటలు సాగు చేసుకోవాలని పేర్కొన్నారు.

రోడ్లపైనే పశువుల తిష్ట

- రోడ్లపై పదుల సంఖ్యలో పశువుల సంచారం
- అయినా పట్టింపు లేదు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, పాదచారులు



జిల్లా కేంద్రంలో రోడ్డుపైనే పదుల సంఖ్యలో సంచరిస్తున్న పశువులు



రోడ్డుపై అడ్డంగా నిలిచిన పశువులు

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలో పశువుల సంచారం పెరగడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారులపైనే పశువులు తిష్ట వేయడంతో వాహనదారులు, పాదచారులు అవస్థలు తప్పడం లేదు. వాటి వల్ల తరుచూ ప్రమాదాల బారిన పడుతున్నామని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. అయినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు.

జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్, క్రిష్ణవేణి చౌరస్తా, గాంధీచౌక్, రాజీవ్ సర్కిల్, కూరగాయల మార్కెట్ తదితర ప్రాంతాల్లోని రోడ్డుపైనే పశువులు తిష్ట వేస్తున్నాయి. పదుల సంఖ్యలో రోడ్లుపై ఇష్టారీతిన తిరుగుతూ, పరుగెత్తడం, పడుకోవడం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు భయపడుతున్నారు. ఇలా రోడ్డు మధ్యలో అడ్డంగా పశువులు గంటల తరబడి ఉండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది.

తోపుడు బండ్లపై ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు తింటూ పాడు చేస్తున్నాయని చిరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనదారులపైకి పశువులు రావడంతో ప్రమాదాలు చోటు చేసుకున్న సంఘటనలున్నాయి. పురపాలక అధికారులు సైతం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇటు వాహనదారులకు, అటు పాదచారులు, చిరు వ్యాపారులు పశువుల వల్ల ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



జిల్లా కేంద్రంలో ప్రధాన రోడ్లపై పశువుల సంచారం పెరిగిన మాట వాస్తవమే. ఇక్కడ పశువులను తరలించేందుకు ఎనిమల్ కేర్ సెంటర్స్ లేవు. కౌన్సిల్ సమావేశంలో చర్చించి, ప్రత్యేకంగా వాటికి స్థలం ఏర్పాటు చేసి, రోడ్లపై సంచరిస్తున్న పశువులను తరలించేలా చర్యలు చేపడుతాం.

– దశరథం, మున్సిపల్ కమిషనర్, గద్వాల

అనధికార వసతిగృహాలపై చర్యలు తీసుకోండి



వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

గద్వాల అర్బన్: జిల్లాలోని అనధికారికంగా వసతి గృహాలు నిర్వహిస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కో కన్వీనర్ శివకుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఐడీఓసీలోని విద్యాశాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్ విజయలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. గద్వాల, అలంపూర్, అయిజలో అనధికారికంగా ప్రైవేట్ పాఠశాలలు వసతిగృహాలను నిర్వహిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి రూ.లక్షల్లో వసూలు చేస్తున్నారని తెలిపారు. అదేవిధంగా ప్రైవేట్ పాఠశాలలు రెండో శనివారం, ఆదివారాల్లో కూడా తరగతులను నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వినోద్‌కుమార్, మహేష్, వసంత్, రాజేష్, శివ తదితరులు ఉన్నారు.

పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న డీకే స్నిగ్ధారెడ్డి

గద్వాల: నియోజకవర్గంలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే స్నిగ్ధారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో సభ్యత్వ నమోదులో పాల్గొని మాట్లాడారు. భవిష్యత్‌లో పార్టీ అధికారంలోకి రావాలంటే ప్రతి ఒక్క కార్యదర్శి 100మందిని చేర్పించేలా కృషి చేయాలన్నారు. ప్రతిబూత్‌లో 75శాతం మెంబర్‌షిప్ చేయించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి, కన్వీనర్ రామాంజనేయులు, శివారెడ్డి, బండల వెంకట్రాములు, రాంచంద్రారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంచాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న నోడల్ అధికారి నరేష్

మల్దకల్: పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలని మండల నోడల్ అధికారి నరేష్ ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం మండలంలోని నీలిపల్లి, చర్లగార్లపాడు ప్రాథమిక పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకుని ఉన్నతంగా ఎదగాలన్నారు.

నడిగడ్డవాసులకు ఆరోగ్యశ్రీ వర్తింపజేయండి

శాంతినగర్: నడిగడ్డ వాసులకు కర్నూల్‌లోని ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు అందించేలా చూడాలని పట్టణానికి చెందిన తెలుగునాడు కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గజేంద్రగౌడ్ వినతిపత్రం సమర్పించారు. గద్వాల, అలంపూర్ నియోజకవర్గ ప్రజలు వివిధ అనారోగ్య సమస్యల నిమిత్తం కర్నూలులోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తారని, వారందరికి ఉచితంగా వైద్య సేవలు అందేలా చూడాలని విన్నవించినట్లు గజేంద్రగౌడ్ తెలిపారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆయన పేర్కొన్నారు.

వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



అయిజలో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు



ఎర్రవల్లిలో కృష్ణుడికి పూజలు చేస్తున్న భక్తులు



ఉండవెల్లి మండలం ప్రాగటూరులో..

అయిజ: శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా మండలంలోని బింగుదొడ్డిలో మంగళవారం శ్రీకృష్ణుడి ఉత్సవ విగ్రహాన్ని భక్తి శ్రద్ధలతో ఊరేగించారు. త్రైత సిద్ధాంత ప్రభోద సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన శోభాయాత్రకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

ఉండవెల్లి: మండలంలోని కంచుపాడులో కృష్ణుడి ఆలయంలో, తక్కశీలలో యాదవ సంఘం ఆధ్వర్యంలో, ప్రాగటూరులో యాదవ సంఘం ఆధ్వర్యంలో ఉట్టి కొట్టించారు.

ఎర్రవల్లి: మండల కేంద్రంలో త్రైతసిద్ధాంత ప్రభోదా సేవాసమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని జన్మాష్టమి వేడుకలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఎర్రవల్లి కూడలిలో ఏర్పాటు చేసిన కృష్ణుని విగ్రహానికి ప్రత్యేక పూజలను నిర్వహించారు.

రాజకీయ కుట్రతోనే కవిత అరెస్ట్



అయిజలో నినాదాలు చేస్తున్న నాయకులు



గట్టులో టపాసులు కాలుస్తున్న నాయకులు

గద్వాల అర్బన్: రాజకీయ కుట్రతోనే ఎమ్మెల్సీ కవితను అరెస్ట్ చేసినా, కోర్టులో ధర్మమే గెలిచిందని బీఆర్ఎస్ నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, బాసు హనుమంతు అన్నారు. మద్యం కుంభకోణం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటు జైలులో ఉన్న కవితకు మంగళవారం బెయిల్ మంజూరు కావడంతో బీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని కృష్ణవేణి చౌరస్తాలో టపాసులు కాల్చి సంబరాలు చేశారు. కార్యక్రమంలో మోనేష్, తిమ్మప్ప, భాస్కర్, బీచుపల్లి, శివ, మహబూబ్, సూరి తదితరులు ఉన్నారు.

గట్టు: ఎమ్మెల్సీ కవితకు బెయిల్ లభించడంపై బీఆర్ఎస్ నాయకులు మండల కేంద్రంలో సంబరాలను నిర్వహించారు. కార్యక్రమంలో రాము నాయుడు, వెంకటేష్, రాజునాయుడు, బాసు గోపాల్, రొల్లి కృష్ణ, గురు, బాసు సూరి, గురు, రాజగోపాల్, కర్రెప్ప, వీరేష్, బెంజిమెస్, శాంతప్ప తదితరులు పాల్గొన్నారు.

అయిజ: బీఆర్ఎస్ నాయకులు మండల కేంద్రంలో మంగళవారం సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో వెకంట్రాములు, ప్రేమలత, పల్లయ్య, రమేష్ బాబు, మద్దిలేటి, వీరేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోండి




వినతిపత్రం అందజేస్తున్న కేవీపీఎస్ నాయకులు

రాజోళి: కొత్త రాజోళిలో వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ నాయకులు పంచాయతీ కార్యదర్శి కృష్ణకు మంగళవారం వినతి పత్రం అందచేశారు. వర్షాకాలం కావడంతో పలు వార్డుల్లో వర్షపు నీరు నిలిచి దోమలు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. వాటితో పాటు డ్రెయినేజీ కాల్వలు కూడా శుభ్రం చేయకపోవడంతో మురుగు నిండి బయటకు వచ్చి రోడ్లను మరింత అపరిశుభ్రం మారాయన్నారు. దోమలు విపరీతంగా పెరగడం వల్ల మలేరియా, టైఫాయిడ్, డెంగీ లాంటి ప్రమాదకర వ్యాధులు ప్రబలుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, దేవరాజు, శీలన్న, సులేమాన్, ఖాజన్న తదిదరులు పాల్గొన్నారు.

గద్వాల అభివృద్ధిపై నివేదన

గద్వాల: నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రభుత్వ పరంగా ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కాంగ్రెస్ పార్టీ గద్వాల నాయకులు మోహన్‌రావు, మధుసూదన్‌రెడ్డి, అచ్చన్నగౌడ్, ధరూరు శ్రీధర్, లత్తిపురం వెంకట్రామిరెడ్డి కోరారు. వారు మంగళవారం ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని హైదరాబాదులోని క్యాంపు కార్యాలయంలో కలిసి గద్వాల అభివృద్ధితో పాటు, రాజకీయ పరంగా పలువిషయాలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు వారు తెలిపారు. అదే విధంగా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆయన అనచరులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులతో దురుసుగా ప్రవర్తిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నట్లు అలాంటి వారిపై పార్టీ పరంగా క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని కోరినట్లు వారు పేర్కొన్నారు.

బస్సులు రాక.. విద్యార్థుల కాలినడక



మాన్‌దొడ్డి నుంచి పచ్చర్లకు నడుచుకుంటూ వెళ్తున్న విద్యార్థులు

రాజోళి: చదువుకునేందుకు విద్యార్థులకు కాలినడక తప్పడం లేదు. అధికారుల అలసత్వం కారణంగా విద్యార్థులు ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తుంది. మండలంలోని పచ్చర్లకు చెందిన విద్యార్థులు చదువుకునేందుకు మాన్‌దొడ్డికి వెళ్తుంటారు. ఈ రెండు గ్రామాల మధ్య మూడు కిలోమీటర్ల దూరం ఉంది. మాన్‌దొడ్డికి వెళ్లే బస్సులోనే ఈ విద్యార్థులు పాఠశాలకు వెళ్తుంటారు. బస్సు సమయానికి రాకపోవడంతో ఉదయం క్లాసులు తప్పుతున్నాయని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. తాజాగా మంగళవారం కూడా బస్సు రాకపోవడంతో సాయంత్రం వేళ బాలికలు నడుచుకుంటూ ఇళ్లకు వెళ్లారు. ఇంటికి వెళ్లేలోగా చీకటి పడుతుండటంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు సమస్యకు పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

కేటీదొడ్డి: పంచాయతీలో పని చేస్తున్న సిబ్బందిని క్రమబద్ధీకరించాలని పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తిక్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ కృష్ణమోహన్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీ వర్కర్స్‌కు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న జీతాలు రాకుంటే కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రభుత్వం ప్రత్యేక నిధులు విడుదల చేసి వేతనాలు ఇవ్వాలన్నారు. కార్మికులకు మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నర్సింహులు, నర్సింహులు, తిరుమలఐలన్న, నల్లస్వామి, భీమేష్, జయన్న తదితరులు ఉన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటుకు డిమాండ్



వినతిపత్రం అందజేస్తున్న ఎలక్ట్రీషియన్లు

ధరూరు: ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్ కార్మికులకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తహసీల్దార్ వెంకట్రావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. సంఘం నాయకులు మాట్లాడుతూ.. ప్రతి ఒక్క ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ లేబర్ కార్డును పొందాలని, ఎలక్ట్రికల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రైవేట్ ఎలక్ట్రికల్ అధ్యక్షుడు అయుబ్, వెంకట్రాములు, రాఘవేంద్ర, జయన్న, వహీద్, మురళీ, నర్సింహులు, మాలిక్, సంపత్, రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్స్ స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయం



సంస్థకు సంబంధించిన టీషర్టులను విడుదల చేస్తున్న డీడబ్ల్యూఓ సుధారాణి

గద్వాల అర్బన్: ప్రిన్స్ స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని డీడబ్ల్యూఓ సుధారాణి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో సంస్థ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత సేవా కార్యక్రమాల్లో ముందుండాలన్నారు. సంస్థ చేపడుతున్న కార్యక్రమాలకు తమవంతు సహాయ సహకారాలను అందిస్తామని చెప్పారు. అనంతరం సంస్థకు సంబంధించిన టీషర్టులను విడుదల చేయడంతో పాటు వార్షికోత్సవం సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో డీసీపీఓ నర్సింహ, సీడబ్ల్యూసీ చైర్మన్ సహదేవుడు, న్యాయవాది వరలక్ష్మీదేవి, ప్రిన్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు గిరిబాబు, సభ్యులు ఉన్నారు.

కృష్ణానది ఒడ్డున వృద్ధుడి మృతదేహం లభ్యం

వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలోని రంగాపురం శివారులోని కృష్ణానది పుష్కరఘాట్ వద్ద మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. హైదారాబాద్‌లోని కిస్మాన్‌పూర్ రోడ్డుకు చెందిన ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగి చేజర్ల కొండారెడ్డి (87) 26న వాకింగ్‌కు అని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో కాలనీలో ఉన్న సీసీ కెమెరాలలో పరిశీలించగా మెయిన్‌రోడ్డు వైపు వెళ్లినట్లు గుర్తించారు. వెంటనే శంషాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని వారు తెలిపారు. మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకొని.. సీసీ కెమరాలలో పరిశీలించగా మృతుడు కర్నూల్, నంద్యాల పికెట్ డిపో బస్సు ఎక్కినట్లు గుర్తించి, డ్రైవర్‌ను ఫోన్‌లో సంప్రదించారు. రంగాపురం శివారులోని కృష్ణానది సమీపంలో బస్సు దిగిపోయాడని డ్రైవర్ పోలీసులకు తెలిపారు. మంగళవారం కృష్ణానది వెంట వెతకగా బ్రిడ్జి కింద మెట్ల వద్ద చెప్పులు కనిపించాయి. పుష్కరఘాట్ సమీపంలో నది ఒడ్డున మృతదేహం లభించింది. దీంతో కుటుంబ సభ్యులు పెబ్బేరు పోలీసులకు సమాచారం ఇవ్వగా.. వారు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు చేజర్ల వీరరాఘవరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

శాంతినగర్: రాష్ట్రస్థాయిలో నిర్వహించనున్న చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలకు స్థానిక సరస్వతి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు కరస్పాండెంట్ మమత తెలిపారు. జిల్లాస్థాయిలో నిర్వహించిన చిత్రలేఖనంలో పాఠశాలకు చెందిన గంగానిషిత ద్వితీయ స్థానం, వ్యాసరచన పోటీలో నందిని ద్వితీయస్థానంలో నిలిచారన్నారు. వచ్చే నెల 2న ముచ్చింతల్‌లోని చినజీయర్‌స్వామివారి ఆశ్రమంలో ఉదయం 10 గంటలకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు.